మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయించాలి..

- హరితహారంలో లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటాలి
- దశాబ్ది సంపద వనాలు, హార్టికల్చర్ ప్లాంటేషన్‌ల పనులలో వేగం పెంచాలి
- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**వనపర్తి, జూలై15, ప్రభాతవార్త:** శనివారం ఉదయం జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, డీపీవోలు, డీఆర్‌డీవోలతో పంచాయతీ రాజ్ కమిషనర్ హనుమంత రావు, స్పెషల్ కమిషనర్ ప్రసాద్‌లతో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తు నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు వేగంగా పూర్తి కావాలని పంచాయతీ రాజ్ డీఈలు , ఏఈలతో దీనిపై ఎప్పటికప్పుడు అదనపు కలెక్టర్ లోకల్ బాడీలు సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. హరితహారంలో లక్ష్యాలకనుగుణంగా గ్రామాల్లో మొక్కలు విరివిగా నాటాలని, దశాబ్ది సంపద వనాలు, హార్టికల్చర్ ప్లాంటేషన్‌ల పనులలో వేగం పెంచాలన్నారు. నిర్ణీత లక్ష్యాలను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలన్నారు. ఇందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి , కింది స్థాయి అధికారులు, ఉద్యోగులను వేగిర పరచాలని సూచించారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రభుత్వం అన్ని గ్రామాలను కడిగిన ముత్యంలా చేశారన్నారు. వారి ఆలోచనలకి అనుగుణంగా రాష్ట్రంలో 12వేల 769 గ్రామ పంచాయతీలలో 6,544 గ్రామ పంచాయతీలకి భవనాలు ఉన్నాయన్నారు. మిగతా 6వేల 225 గ్రామ పంచాయతీలలో నిధులు మంజూరు చేసి నూతనంగా నిర్మిస్తున్న 3622 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. హరితహారంలో భాగంగా పంచాయతీ రాజ్ శాఖ 6.7 కోట్ల మొక్కలు నాటే లక్ష్యం ఇవ్వగా, ఇప్పటి వరకు 2.25 కోట్ల మొక్కలు నాటినట్లు మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. మిగితా మొక్కలను సైతం త్వరగా నాటాలని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ శాఖకు కేటాయించిన భూముల్లో కాలువలు, వారి అవసరానికి పోను మిగిలన భూమిలో ఎవరు కబ్జా చేయకుండా వాటిలో దశాబ్ది సంపద వనాలు ఏర్పాటుచేయాలని, హార్టికల్చర్ ప్లాంటేషన్ సైతం పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపుకలెక్టర్ వేణుగోపాల్, డీపీవో సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా అధికారులు

## తిరుపతిలో విగ్రహాలను పరిశీలించిన ఎమ్మెల్యే

**భూత్పూర్, జులై 15 ప్రభాతవార్త :** దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి స్వగ్రామం భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో నూతనంగా పునర్నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈనెల 17 నుండి 19 వరకు మూడ్రోజులపాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నూతన ఆలయంలో విగ్రహాలను ప్రతిష్టించేందుకు ఎమ్మెల్యే ఆల ఆయన సతీమణి ఆల మంజుల శనివారం చిత్తూరు జిల్లా తిరుపతిలో విగ్రహాల తయారీ కంపెనీకి వెళ్లి శ్రీ సీతారామ లక్ష్మణ, శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాలను పరిశీలించారు. అన్నాసాగర్‌లో నూతన ఆలయంలో 17న గణపతిపూజ, 18న అవహితపూజ, మూలమంత్ర పూజలు, 19న మంత్రోచ్ఛరణ విగ్రహాల ప్రతిష్ట, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



విగ్రహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆల దంపతులు

## పోలీసులు క్రమశిక్షణ కలిగి ఉండాలి

### అదనపు ఎస్పీ డా. నాగేంద్రుడు

**నారాయణపేట ప్రతినిధి, జులై 15 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆర్ముడు రిజర్వ్ పోలీసులు, నారాయణపేట సర్కిల్ స్టాఫ్, జిల్లాలోని పోలీసులకు సర్కిల్ కార్యాలయంలో వీక్లీ పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు అదనపు ఎస్పీ (డిఎఆర్) నాగేంద్రుడు హాజరై ఆర్ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో సిబ్బంది చేసిన పరేడ్‌ను, ఫుట్‌డ్రిల్ ప్రదర్శనను పరిశీలించి పరేడ్‌పై ప్రతి ఒక్కరు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరి యూనిఫామ్, నీట్ టర్న్ అవుట్ కలిగి ఉండాలని సిబ్బంది టౌర్నవుట్ తనిఖీ చేయడం జరిగింది. అలాగే పోలీసులు విధులు నిర్వర్తించే సమయంలో క్రమశిక్షణ, సమయపాలన కలిగి ఉండాలని సూచించారు. పరేడ్‌కు సంబంధించిన ఫొటోలను టిఎస్ కాప్ ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయాలని అధికారులకు తెలుసుకోవడం జరుగుతుందని పోలీసులు ఉపయోగించే ఆయుధాల గురించి పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణయ్య, ఆర్ఎస్ఐలు ఇందిర, శివశంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వీక్లీ పోలీస్ పరేడ్ నిర్వహిస్తున్న దృశ్యం

## పాఠశాల నూతన భవనం, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

### -నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 15 ప్రభాతవార్త:** బిజినపల్లి మండలంలోని గౌరారం గ్రామంలో మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.30లక్షలతో ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణం, రూ.5లక్షలతో నిర్మించనున్న మత్స్యకార సహకార సంఘం నూతన భవనానికి ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 సంవత్సరాల క్రితం తెలంగాణ రాష్ట్రం ఎలా ఉందో, ప్రస్తుతం ఏ విధమైన అభివృద్ధి సాధించిందో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. నూటికి 50 శాతం ఉన్న మహిళలకు తాగే నీళ్ల కోసం బోరింగ్‌లు కొట్టి కొట్టి చేతులు పోయినవి కానీ నేడు స్వరాష్ట్రంలో ఇంటి ముందుకే మిషన్ భగీరథ పథకం ద్వారా మంచినీరు అందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఎవరైన చనిపోతే అపద్బాందు పథకం క్రింద రూ.50వేలు ఇస్తుండే కానీ నేడు కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక రైతు చనిపోతే ఎలాంటి కారణం లేకుండానే 11 రోజుల్లో రూ.5లక్షలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమన్నారు. తెలంగాణ ప్రజలు సీఎం కేసీఆర్ పాలనలో ఆత్మ గౌరవంతో బ్రతుకుతున్నారని, మీకు 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతు భీమా, సాగునీరు అందిస్తున్న ప్రభుత్వం కావాలా లేదా ఆలోచించుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసపూరిత హామీలు నమ్మి మోసపోవద్దన్నారు. పాఠశాల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే విచ్చేయడంతో పాఠశాల విద్యార్థులు ఘన స్వాగతం పలికి ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం పలు కాలనీల్లో పర్యటించి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

## మధ్యాహ్న భోజనంలో పురుగులు..

**గండీడ్, జులై 15 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వెన్నచేడ్ ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనంలో పురుగులు వచ్చాయి. పురుగుల అన్నం చూసిన విద్యార్థులు భయాందోళనకు లోనయ్యారు. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిసి పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడిని నిలదీశారు. మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు.



అన్నంలో పురుగులు దృశ్యం

# 30 ఏళ్లుగా బైపాస్ పేరిట టైంపాస్ చేశారు...

- ఈ నెల 23న ట్యాంక్‌బండ్ వద్ద మెగాడ్రోన్ షో
- నెల రోజుల్లో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి
- ఇండస్ట్రియల్ కారిడార్‌ను బైపాస్‌తో కనెక్ట్ చేస్తాం
- బైపాస్ సెంట్రల్ లైటింగ్ పనుల భూమిపూజ సందర్భంగా మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 15 ప్రభాతవార్త :** 30 ఏళ్లుగా బైపాస్ పేరిట గత పాలకులు టైంపాస్ చేశారని తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కెసిఆర్ సహకారం, ఆశీస్సులతో పట్టణవాసుల కలను నెరవేర్చామని, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎదిర చౌరస్తాలో రూ. 1.76 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బైపాస్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. పనులను లాంఛనంగా ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బైపాస్ రోడ్డు అనేది స్థానికుల కల అని ఆ కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందని చెప్పారు. ఇప్పుడు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం వల్ల బైపాస్ రోడ్డుకు మరింత కల వస్తుందన్నారు. నెల రోజుల్లో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం జడ్చర్ల నుండి, భూత్పూర్ నుంచి మహబూబ్‌నగర్ చేరుకునేందుకు ఫోర్‌లేన్ రోడ్లు అందుబాటులో ఉన్నాయని త్వరలో దివిటిపల్లి నుంచి ఐటి టవర్ మీదుగా బైపాస్ ద్వారా పట్టణాన్ని చేరుకునేందుకు మరో లేన్‌రోడ్డు అందుబాటులోకి వస్తుందన్నారు. ఐటి, ఇండస్ట్రియల్ కారిడార్‌ను బైపాస్‌తో కనెక్ట్ చేస్తామన్నారు. ప్రస్తుతం బైపాస్ రోడ్డుకు కొనసాగింపుగా క్రిస్టియన్‌పల్లి నుంచి పాలమూరు యూనివర్సిటీ మీదుగా చిన్నదరపల్లి వరకు మరో బైపాస్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని మంత్రి తెలిపారు. సెంట్రల్‌లైటింగ్‌తో సహా ప్రస్తుతం బైపాస్ రోడ్డుకు ఇరువైపు ఫుట్‌పాత్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

**ఈనెల 23న ట్యాంక్ బండ్ వద్ద మెగా డ్రోన్ షో..**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గతంలో అంతర్జాతీయ స్థాయి కైట్ ఫెస్టివల్ నిర్వహించామని, ఇప్పుడు అంతకంటే గొప్పగా ట్యాంక్‌బండ్ వద్ద ఈనెల 23వ తేదీన సాయంత్రం 7 గం.లకు 450 డ్రోన్లతో మెగా డ్రోన్ షో ఏర్పాటు చేసినట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఈ డ్రోన్ షో కోసం పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో సింగపూర్, అమెరికా దేశాల్లో ఇలాంటి డ్రోన్ షో నిర్వహించారని ఇటీవలే సచివాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూడా అద్భుతమైన డ్రోన్ షో ద్వారా చూపరులను కట్టిపడేసేలా డ్రోన్ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలంతా తరలివచ్చి అద్భుతమైన ఈ డ్రోన్ షో తిలకించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని వివిధ పర్యాటక క్షేత్రాలు, ముఖ్యమైన ప్రదేశాలను డ్రోన్ షో లైటింగ్ ద్వారా షో తర్వాత మిగతా 9 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోనూ ఈ ప్రదర్శన ఉండనుందని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న, డిసిసిబి ఇంచార్జి ఛైర్మన్ కె. వెంకటయ్య, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్ యాదవ్, జిల్లా గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శాంతన్న యాదవ్, కలెక్టర్ జి.రవినాయక్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ గణేష్, మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్





మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలకు మహర్దశ..

- సీఎం కేసీఆర్ కారణజన్ముడు
- మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**వెల్దండ, జూలై 15 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలకు మహర్దశ చేకూరిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలో శంకర్‌కొండ, గానుగట్టుతాండ, బర్కత్‌పల్లి, చెర్కూర్, నారాయణపూర్, మర్రిగుంత తాండ, కేస్లీతాండ, బండోనిపల్లి, బొల్లంపల్లి గ్రామాల్లో పల్లె దవాఖానా, నూతన గ్రామ పంచాయతీ భవనాలకు, బీటీ రోడ్డు పనులకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ ధ్యాప విజితారెడ్డి, ఎంపీపీ విజయ జైపాల్‌నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డితో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లతో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ భూమి పూజ కార్యక్రమం నిర్వహించి శంకుస్థాపనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి గిరిజన తండాలకు మౌళిక వసతుల సదుపాయాలు లేకపోవడంతో తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలన్న కోరికను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు గిరిజన సంక్షేమం, తండాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్దపీట వేసి గిరిజనుల రిజర్వేషన్ పెంచి అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. సీఎం కేసీఆర్‌ను స్పెషల్ డెవలప్‌మెంట్ క్రింద నిధులను అడిగిన వెంటనే రూ.62కోట్లు మంజూరు చేశారు. మండలంలో రూ.16 కోట్ల 60లక్షలతో గ్రామ పంచాయతీ భవనాలకు కేటాయించిందన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుభీమా, సకాలంలో ఎరువులు, 24 గంటల ఉచిత విద్యుత్, ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, వృద్దులకు, వితంతవులకు పింఛన్లు, షాది ముబారక్, కళ్యాణలక్ష్మి పథకం ద్వారా ఎంతో మందికి లబ్ది చేకూర్చాన్నారు. 10 సంవత్సరాల్లో అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని, ప్రతి రూపాయి పేదలకు అందించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్‌సింగ్, దుర్గప్రసాద్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ శాంతిగోపాల్‌నాయక్, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ భాస్కర్‌రావు, నాయకులు జైపాల్‌నాయక్, గోపాల్‌నాయక్, జయప్రకాష్, గుత్తి వెంకటయ్య, మోతిలాల్ నాయక్, నీరటి రాములు, వెంకటేశ్వర్‌రావు, కోమిటి, అంజ్యానాయక్, పత్యానాయక్, భీరయ్య, చెర్క రేవతి రాజశేఖర్, శ్రీనునాయక్, బుజ్జి లక్ష్మణ్‌నాయక్, మట్ట శారదమ్మ, అంజయ్య, అపర్ణ, జంగిలి యాదగిరి, బాల్ లక్ష్మయ్య, నర్సింహ్మ ముదిరాజ్, నర్సింహ్మ, నాగులునాయక్ తదితరులు ఉన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## నీళ్ల చారు... ఉడకని అన్నమా.?

-నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు తప్పవు...-లక్ష్యంతో చదవాలి -నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు

**వంగూరు, జూలై15 ప్రభాతవార్త:** ప్రభుత్వపాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నప్పటికి క్రింది స్థాయిలో అమలు కాకపోవడం, విద్యార్థులకు అందించే భోజనం ఉడికి ఉడకనట్లుగా ఉండటం, నీళ్ల చారుతో విద్యార్థులకు భోజనాన్ని అందించడమేమిటని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటిరాములు ప్రశ్నించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంపట్ల నిర్వాహకులు, అధ్యాపకులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శనివారం వంగూరు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లు, వంట గది, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి విద్యార్థులకు సరిపడే నిధులు కేటాయిస్తున్నప్పటికి మధ్యాహ్న భోజనంలో ఎందుకు అవకతవకలు జరుగుతున్నాయని, మరోసారి ఇలాంటి పునరావృతంకాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు లక్ష్యంతో విద్యను అభ్యసిస్తే ఉన్నతశిఖరాలను అధిరోహిస్తారని, ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకొని ఏకాగ్రతను పెంపొందించి విద్యను అభ్యసించాలని ఆయన సూచించారు. సర్కార్ బడులను బలోపేతం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంపాఠశాలల్లో మౌళికవసతులను కల్పించి పేదింటి బిడ్డలకు కేజీ టూ పీజీ ఉచితవిద్యను అందించేందుకు గురుకులాలను ఏర్పాటు చేసి అధ్యాపకులను అందుబాటులో ఉంచి విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషిచేస్తుందని పేర్కొన్నారు. గతంలో కస్తూర్బా పాఠశాలను సందర్శించిన సమయంలో పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు రూ.5లక్షలు మంజూరు చేయడంతో మరుగుదొడ్లు, మౌళిక వసతులను ఏర్పాటు చేశారని ఆయన గుర్తుచేశారు. మరో రూ.3లక్షలు మంజూరు చేస్తూ మిగిలిపోయిన మౌళిక వసతులను కల్పించుకునేందుకు మంజూరు చేస్తున్నానని ఆయన ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల అధ్యాపకులు నిర్లక్ష్యం వీడి నాణ్యమైన విద్యను అందించి వారికి బంగారు బాటలు వేయాలని ఆయన సూచించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని, ఆ డబ్బులను బ్యాంక్ అధికారులు రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెట్టడం వల్ల ఎంతో మంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారనే విషయాన్ని తెలుసుకున్న ఎంపీ రాములు బ్యాంక్ అధికారులతో మాట్లాడి రైతులను ఇబ్బందులు పెట్టకుండా సకాలంలో రైతుబంధు డబ్బులు అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మందా రాజేందర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు హామీద్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ పగిళ్ల సత్యం, నాయకులు ఎల్లగౌడ్, హరినాథ్, డిండి బాలస్వామి, లాలుయాదవ్, కొమ్ము లక్ష్మయ్య, నారాయణరావు, రామచంద్రయ్య, రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయభాస్కర్, ఎంఈఓ శంకర్‌నాయక్, ఏఈ మణిపాల్, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తదితరులు ఉన్నారు.



అన్నం, సాంబర్‌ను పరిశీలిస్తున్న ఎంపీ రాములు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

## తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలి..

### -మహబూబ్‌నగర్ కలెక్టర్ జి రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 15, ప్రభాతవార్త :** ఎలాంటి తప్పులు లేని ఓటరు జాబితానే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ జి రవినాయక్ అన్నారు. శనివారం ఆయన ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా వివిధ ఫారాల కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతిరోజు ఫారం 6,7,8 కింద వచ్చే వాటన్నింటిని ఏరోజుకారోజు పరిష్కరించాలని పెండింగ్‌లో ఉంచొద్దన్నారు. ముఖ్యంగా ఓటరు జాబితా నుంచి తొలగింపునకు సంబంధించి ఖచ్చింతమైన రికార్డులను ఆధారంగా చేసుకొని మాత్రమే తొలగించాలని సూచించారు. కొత్త దరఖాస్తులు, అభ్యంతరాలు ప్రతి రోజు పరిష్కరించడం అన్ని ఫారాలు జాగ్రత్తగా పరిశీలించి రికార్డు చేయాలన్నారు. చనిపోయిన వారికి జాబితా నుంచి తొలగించే ముందు మరణ ధ్రువపత్రం ఆధారంగా తొలగించాలన్నారు. స్థానిక సంస్థల నూతన అదనపు కలెక్టర్ వెంకటేశ్ దోత్రి , రెవెన్యూ అదనపుకలెక్టర్ సీతారామారావు, జెడ్పీ సీఈవో జ్యోతి, డీఆర్‌డీవో యాదయ్య. పీడీవో వెంకటేశ్వర్లు, ఆర్డీవో అనిల్‌కుమార్, తాసిల్దార్లు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

## నేడు పీయూలో సెంట్రల్ రీసెర్చ్ బిల్డింగ్‌కు శంకుస్థాపన

### - హాజరుకానున్న ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 15, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలో సెంట్రల్ రీసెర్చ్ ఫెసిలిటీస్ బిల్డింగ్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు పీయూ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10.30గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీయూ రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు కోరారు.

## కేసులను త్వరితగతిన పరిష్కరించాలి..

వర్షాకాలం దృష్ట్యా చెరువులు, కాలువల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి

నెలవారి సమీక్షలో మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 15 ప్రభాతవార్త :** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ సిబ్బందికి నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, పిటీ కేసుల గురించి తెలుసుకుని వాటిని త్వరితగతిన పూర్తి చేయమని అధికారులకు ఆదేశాలిచ్చారు. రోడ్డు ప్రమాదంలో చాలా జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి త్వరితగతిన నివారణ చర్యలు చేపట్టామన్నారు. మీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రతి గ్రామాన్ని సందర్శించి, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ పెద్దలతో సమావేశమై సిసి కెమెరాలు అమర్చుకోవాలని, అమర్చుకుంటే వాటివల్ల లాభాలను తెలియజేసి ప్రజలందరికి అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌లో వచ్చిన దరఖాస్తుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారికి త్వరగా న్యాయం జరిగేటట్లు చూడాలన్నారు. వర్షాకాలం కావున వాగులు, చెరువుల దగ్గర నీరు ప్రవహిస్తున్నప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ప్రజలందరికి సైబర్ క్రైమ్ నేరాల గురించి అవగాహన కల్పించామన్నారు. గత నెలకుగాను జిల్లాలో వివిధ వర్టికల్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి రివారులు అందిజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, డిఎస్పీలు మహేష్, రమణారెడ్డి, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ సైదయ్య, టూటౌన్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్, మహబూబ్‌నగర్ రూరల్ సిఐ స్వామి, జడ్చర్ల టౌన్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌బాబు, భూత్పూర్ సిఐపి రజితారెడ్డి, మహిళా పిఎస్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్‌లు, ఎస్సైలు పాల్గొన్నారు.





సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ





సమీక్షలో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

**- 8వ వార్డు సందర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్**



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 15, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డును మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్ సందర్శించారు. శనివారం ఆమె మున్సిపల్ సిబ్బందితో కలిసి పిచ్చిమొక్కలను తొలగింపజేయించారు. రోడ్లను శుభ్రం చేయించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. తమ పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగాలు దరిచేరకుండా కాపాడుకోవాలని కోరారు. ఇండ్ల చుట్టూ మురుగు చేరుకోకుండా చూసుకోవాలన్నారు. వానకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందునా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అమెవెంట వార్డు సభ్యులు, మున్సిపల్ వార్డు ఇన్‌చార్జి ఉన్నారు.

## చంద్రయాన్-3 విజయవంతంపై సంబురాలు..

**- డైట్ కళాశాలో విద్యార్థుల సంతోషం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 15, ప్రభాతవార్త :** శ్రీహరి కోట నుంచి భూకక్ష్యలోకి ప్రవేశించి చంద్రయాన్ -3 విజయవంతం కావడంపై మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రలోని డైట్ కళాశాలలో విద్యార్థులు సంబురాలు చేసుకున్నారు. ఈ మేరకు శనివారం కళాశాలలో విద్యార్థులు జాతీయ జెండాను ప్రదర్శించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహ్మదా మేరాజుల్లాఖాన్ ఛాత్రోపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశం రోధసి శోధనలో మరో మైలు రాయిని దాటిందన్నారు. ఇదే దేశానికే ఎంతో గర్వకారణమన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు తమ కళాశాల తరఫున శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో డైట్ కళాశాల ఛాత్రోపాధ్యాయులు మంచి శాస్త్రవేత్తలు కావాలని ఆకాంక్షించారు. దేశం గర్వించే విధంగా విద్యా ప్రమాణాలు పొందించుకోవాలని, రేపటి పౌరులుగా మారే నేటి బాలలకు మంచి భవిష్యత్తున్నిచ్చే విధంగా బోధన చేయాలని, దేశం గర్వించేస్థాయికి విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటిండెంట్ రామకృష్ణారావు, అధ్యాపకులు భాస్కరయ్య, స్వర్ణలత, సత్యనారాయణగౌడ్, రామకృష్ణ, ఖాదర్ మోయినొద్దిన్, అయేషా, శాంతి రఫియా పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇంటి దగ్గర చదువుకునేలా తల్లిదండ్రులు చూడాలి



**గండీడ్, జూలై 15 ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి స్కూల్లోనే కాకుండా ఇంటి దగ్గరికి వెళ్లాక కూడా వారు చదువుకునే విధంగా తల్లిదండ్రులు చూడాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంగోపాల్ నాయక్ అన్నారు. గండీడ్ మండలంలోని కొమ్మిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పాఠశాలలో టీచర్లు బోధించే బోధనతో పాటు అదనంగా పిల్లలు స్కూల్ దగ్గర చదువుకున్న విధంగా ఇంటిదగ్గర చదువుకున్న విధంగా ఇంటి దగ్గర కూడా చదువుకోవాలని దీని గురించి తల్లిదండ్రులు కూడా చొరవ తీసుకోవాలని ప్రధానో పాధ్యాయుడు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు రాంగోపాల్ నాయక్, ఉపాధ్యా యులు వెంకట్‌శర్మ, హీరాలాల్ రాథోడ్, కృష్ణయ్య, రాములు, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ తిమ్మప్పస్వామి దేవాలయం సందర్శించిన న్యాయమూర్తులు



**మల్దకల్, జూలై 15 ప్రభాతవార్త :** మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శనివారం జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కె. కుషా సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయమూర్తులకు ఆలయ ఛైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, అర్చకులు మేళతాళాలతో ఘనంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించిన వారిని ఘనంగా సన్మానం చేశారు. ఈసందర్భంగా దేవాలయ చరిత్రను ఆలయ ఛైర్మన్ వారికి వివరించా రు. కార్యక్రమంలో ఒకటవ అదనపు జడ్జి అనిరోజ్ క్రిస్టియన్, సీనియర్ సివిల్ జడ్జి ఘంటా కవి తదేవి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి జి. ప్రభాకర్, గద్వాల మెజిస్ట్రేట్ ఉదయనాయక్, ఏజిపి కృష్ణారెడ్డి, ఏజీపి కృష్ణారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## గానుగు నూనె కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**అచ్చంపేట, జూలై 15 ప్రభాతవార్త:**బల్మూర్ మండలం పోలిశెట్టిపల్లి గ్రామానికి చెందిన ఆకారపు సురేందర్, కృష్ణలు వ్యవసాయక్షేత్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన గానుగు నూనె కేంద్రాన్ని ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేసి రైతన్నల అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులను చైతన్యవంతం చేసి వారికి అవసరమగు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి స్వతహాగా అభివృద్ధి చెందుతూ మరొకరికి పనులు కల్పించే విధంగా కర్మగారాలు ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతన్నకు అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, పీఏసీఎస్ ఛైర్మన్ నరసయ్యయాదవ్, వైస్ ఎంపీపీ నారాయణ, నాయకులు ఎల్లయ్య, సురేష్, మల్లేష్, జయన్న తదితరులు ఉన్నారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి...

**-ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**



**అచ్చంపేట, జూలై 15 ప్రభాతవార్త:**విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించేందుకు ఏకాగ్రతను కేంద్రీకరించాలని ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం బల్మూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం విద్యార్థినులు చదువుకునేందుకు అనేక వసతులు, సదుపాయాలు కల్పించిందని, విద్యార్థినులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆయన కోరారు. తల్లిదండ్రుల ఆశయ సాధనే ధ్యేయంగా విద్యను నేర్పిన ఉపాధ్యాయులకు పేరు ప్రతిష్టలు తీసుకొని రావాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు వ్యవసాయ పొలం పనులపై ఉన్న మక్కువ విద్యార్థినులపై పెడితే రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలను సాధిస్తారన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, నాయకులు గోపాల్‌నాయక్, చంద్రమోహన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

## దేవరకద్రలో గోరింటాకు సంబురం..

**-ఘనంగా ఆషాడమాసం పూజలు -భక్తులతో కళకళలాడిన వాసవిమాత ఆలయం**



**దేవరకద్ర, జూలై 15 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం రాత్రి ఆషాడమాసం పూజలను ఆర్యవైశ్యులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా మహిళలు ఈ సంబరాలను భక్తి శ్రద్దలతో, ఆనందోత్సాహాలమధ్య ఘనంగా జరుపుకొన్నారు. ప్రతి ఏడాది ఈ వేడుకలను ఆర్యవైశ్య మహిళలు అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఆర్యవైశ్య జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు మంజులరాణి అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలంతా గోరింటాకు ఆకులను తీసుకవచ్చి గోరింటాకును చేతులకు పెట్టుకొని సంబరపడ్డారు. అనంతరం ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకను జరుపుకొన్నారు. వాసవిమాత అమ్మవారికి అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవిమాత అమ్మవారి ఉత్సహ వాగ్రహాన్ని శోభా యమానంగా అలంకరించి ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఇల్లు లేని పేదలకు రూ.5లక్షల ఆర్థికసాయం..

- **కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది..**
- **టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**
- **ఏడో రోజు కొనసాగిన ప్రజాహిత పాదయాత్ర**



మోతిఘనపూర్‌లో అనిరుధ్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



నందారంలో బాలుడిని ఎత్తుకున్న అనిరుధ్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 15, ప్రభాతవార్త :** కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇల్లు లేని పేదలకు రూ.5లక్షల ఆర్థికసాయం అందజేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. అనిరుధ్ రెడ్డి చేపట్టిన ప్రజాహిత పాదయాత్ర శనివారానికి ఏడో రోజుకు చేరుకున్నది. బాలానగర్ మండలంలోని మోతిఘనపూర్, నందారం, కుషాయిగూడ తండా, పంచనాగులగుట్ట, జాలుగడ్డ తండా మీదుగా యాత్ర సాగింది. అనిరుధ్‌రెడ్డి పాదయాత్రకు దారి పొడవునా ఆయనకుఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 18ఏండ్లు నిండిన యువతులకు ఎలక్ట్రిక్ స్కూటీ అందజేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగ భృతి రూ.4వేలు అందజేస్తామన్నారు. తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. 2018లో మోతిఘనపూర్ నుంచి రాయికల్ గ్రామానికి బీటీ రోడ్డు వేస్తామని శంకుస్థాపన చేసి నేటికీ వేయలేదని విమర్శించారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమని అధికారంలోకి వచ్చిన వెంటనే మోతిఘనపూర్ నుంచి రాయికల్ గ్రామానికి బీటీ రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు.

## సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య భోజనం అందించాలి..

**- అచ్చంపేట బీజేపీ నియోజకవర్గ నేత దేవని సతీష్‌మాదిగ**



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న దృశ్యం

**అచ్చంపేట, జూలై 15 ప్రభాతవార్త:**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు కేజీ టూ పీజీ ఉచిత విద్యను అందించడంతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించి విద్యార్థులకు బంగారు భవిష్యత్తును రూపొందిస్తామని ప్రగల్భాలు పలికిన రాష్ట్ర ప్రభుత్వ మాటలు నీటి మూటలుగానే మిగిలాయని అచ్చంపేట బీజేపీ నియోజకవర్గ నేత దేవని సతీష్‌మాదిగ అన్నారు. శనివారం అచ్చంపేట నియోజకవర్గ పదర మండలంలోని చిట్లంకుంట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం విద్యార్థులకు అందించే నాణ్యతగా లేకపోవడం, విద్యార్థుల పట్ల శాపంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులను అందిస్తుంటే... రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను అందించకుండా మధ్యాహ్న భోజనం చేస్తున్న వర్కర్లకు అందించే రూ. 1000ల వేతనం అందకపోవడంతో నానా ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిన పాత పద్దతిలోనే నిధులు రావడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు అప్పులు చేసి విద్యార్థులకు భోజనాన్ని అందించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. మార్కెట్‌లో రూ.7,8లకు కోడి గుడ్లు ఉంటే రూ.5లు చెల్లించడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బందులు పడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించలేకపోతున్నారని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు గుర్తించడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి రూ.15లను అందిస్తూ నాణ్యమైన భోజనాన్ని అందించి సర్కార్ బడులను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మార్చేందుకు నాణ్యమైన విద్యను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో గాలి మాటలు చెప్పి నేరవేరని హామీలను గుప్పించి గద్దెనెక్కేందుకు పాటు పడుతారే తప్ప ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా రైతులు,ప్రజల, జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఆయన ఎద్దేవా చేశారు. సర్కార్ బడులను బలోపేతం చేసి విద్యార్థులకు అందుబాటులో విద్యను ఉంచుతామన్న మాటలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో మంగ్యనాయక్, మల్లేష్, రవి, రాముయాదవ్, చంద్రయ్య, బాపూజీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి జీవికి జీవించే హక్కు..

**- డా. బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర సహాయచార్యుడు డా.సదాశివయ్య**

**- ప్రపంచ పాముల దినోత్సవం సందర్భంగా అవగాహన**



పాములపై అవగాహన కల్పిస్తున్న సదాశివయ్య

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 15, ప్రభాతవార్త :** సృష్టిలో జీవించిఉన్న ప్రతి జీవి అన్ని జీవులకు సమానామని, ప్రతి జీవికి జీవించే హక్కు ఉందని డా. బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర సహాయచార్యుడు డా.సదాశివయ్య అన్నారు. శనివారం జడ్చర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ పాముల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పాములపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సదాశివయ్య మాట్లాడుతూ పాములలో ఎక్కువశాతం విషరహిత పాములే అన్నారు. వర్షాకాలంలో చాలా వరకు పాములు ఇండ్లలోకి వస్తున్నాయని భయభ్రాంతులకు గురవుతున్నారని, వాటిని చంపకుండా చూడాలన్నారు. పాములను చంపడం వల్ల పర్యావరణ అసమతుల్యత ఏర్పడుతుందన్నారు. వివిధ రకాల పాములు వాటి లక్షణాలు, అవి కరిస్తే వచ్చే లక్షణాలపై పిల్లలకు వివరించి నాగుపాము, జెర్రిపోతు, రక్తపింజర, పూడుపాము, నీరుగట్టు పాములను పట్టి విద్యార్థులకు అందించి ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. పాములపై ఉన్న అపోహలకు శాస్త్రీయ సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో సదాశివయ్య శిష్యుడు రాహుల్, ఈజే మోసెస్, ఎం రామకృష్ణయ్య, ఎం రఘురాం, కే రాజు, ఎన్ సురేందర్, శివానంద్, శివకుమార్, సుభాషిణి, మేరీ, సౌజన్య, నవీన్,రాజేశ్, ఆనంద్, సరళ, శ్రీదేవి పాల్గొన్నారు.

## విద్యాశాఖ ఆదేశానుసారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి

**మక్తల్‌రూరల్, జూలై 15 ప్రభాతవార్త :** తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వీరి మధ్య అవగాహన మెరుగుపరచడానికే ప్రతి నెల, మూడవ శనివారం తెలంగాణ విద్యాశాఖ ఆదేశానుసారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పిటిఎం) సమావేశం ముఖ్య ఉద్దేశమని ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి అన్నారు. పిల్లల కార్యకలాపాలు, అభ్యాసం, ప్రవర్తన గురించి ఏమైనా అభిప్రాయాలు, సమస్యలు, సమాచారం, ప్రశంసలను స్వేచ్ఛగా పంచుకోవడానికి వీలుగా ఈ పిటిఎం సమావేశాన్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారధిగా చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేటట్లు తల్లిదండ్రులు చూడాలని వారికి ఉపాధ్యాయులు అప్పజెప్పిన హోంవర్క్ (గృహకార్యం) సబ్జెక్టులకు సంబంధించిన అసైన్మెంట్ పనులను ఇంటి దగ్గర తప్పకుండా విద్యార్థులు చేసుకునేటట్లు తల్లిదండ్రులు చూడాలని ఈ సందర్భంగా వారు కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు తెలంగాణ విద్యాశాఖ తొలిమెట్టు ఇంటింట చదువులు పంట మన ఊరు మనబడి బాలసభ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు విదుర్ కుమార్, మారుతి, రవిందర్‌రెడ్డి, వరుణ్‌కుమార్, రామ్‌కిరణ్, మహేశ్వరిలతో పాటు ఎస్ఎంసి కమిటి సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సి కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి..

**పివైఎల్ పిఓడబ్ల్యు సంఘాలు..రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, జిల్లా పివైఎల్ కార్యదర్శి ప్రతాప్**



వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి, జూలై 15 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులను భర్తీ చేయాలని, అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు నిల్వ ఉంచాలని చెప్పి ప్రధానమైన డిమాండ్లతో నారాయణపేట జిల్లాలోని డిఎంహెచ్ఓ జిల్లా డిప్యూటి డిఎంహెచ్ఓ శైలజకు వినతి పత్రాలు ఇచ్చారు. ఆ సంఘాల నాయకులు ఈసందర్భంగా మాట్లాడతూ జిల్లాలో వర్షాకాలం వచ్చిందంటే అంటు వ్యాధులు ప్రబలకుండా జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు నిల్వ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లాలో చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో ప్రసవాళ్లకు వచ్చే మహిళలకు తీవ్ర ఇబ్బందులు ఎదురై ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లే దుస్థితి ఏర్పడిందన్నారు. వెంబడే జిల్లాలోని జిల్లా ఆరోగ్య శాఖ డిఎంహెచ్ఓ స్పందించి జిల్లాలోని ఖాళీగా ఉన్న రెగ్యులర్ డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పివైడబ్ల్యు జిల్లా కార్యదర్శి సౌజన్య, పివైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి సలీం, పిఓడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, కె. సునిత (కోటకొండ ఎంపిటిసి) పివైఎల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ, హనుమంతు పాల్గొన్నారు.

## చదువుల్లో రాణించి జిల్లాకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలి




ప్రతిభ కనబర్చిన వారికి మెమెంటోలు అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి, జూలై 15 ప్రభాతవార్త :** విద్యార్థులు చదువులో రాణించి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని 9వ వార్డు కౌన్సిలర్ మహేష్ అన్నారు. శనివారం పేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ర్యాంకులు రావడం చాలా సంతోషించదగ్గ విషయమని సందర్భంగా ఉపాధ్యాయ బృందం, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో జిల్లాలోనే ప్రభుత్వ కళాశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి, విద్యార్థి యూనియన్ నాయకుడు ఫయాజ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## శ్రీశ్రీ పాగుంట లక్ష్మి వెంకటేశ్వరస్వామికి తులం బంగారం వితరణ



**కేటిదొడ్డి, జూలై 15 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో కొండపై శ్రీశ్రీ పాగుంట లక్ష్మి వెంకటేశ్వస్వామి దేవస్థానంకు గద్వాలకు చెందిన ఎన్. క్రిష్ణకుమారి భర్త రంగస్వామి, డీఎస్పీ కార్యాలయం వారు ఈ సందర్భంగా శుక్రవారం దేవాలయంలో వారి దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ సభ్యులకు తులం బంగారు అందజేయగా వారిని శాలువాతో సన్మానం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## 13 ఫీట్లకు చేరిన కోయిల్‌సాగర్‌లో నీటిమట్టం

**దేవరకద్ర, జూలై 15 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో రోజురోజుకు నీటిమట్టం పెరుగుతుంది. తీలేర్ పంప్‌హౌజ్ నుండి 1 మోటర్ ద్వారా కృష్ణ జలాలను కోయిల్‌సాగర్‌కు తరలిస్తున్నారు. దీంతో కోయిల్‌సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతుంది. శనివారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 13 ఫీట్లకు చేరింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ఇంకా 19.5 ఫీట్ల మేర నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు షెట్టర్లను తెరుస్తారు. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంలో కోయిల్‌సాగర్‌కు జలకళ వస్తుంది. ప్రాజెక్టును చూడటానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడ క్రమేపి పెరుతుంది.

## పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి



**కృష్ణ, జూలై 15 ప్రభాతవార్త :** కృష్ణ మండల పరిధిలోని ఖాన్‌దొడ్డి గ్రామ పంచాయతీలో నూతన పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరారు. నారాయణపేట జిల్లా కలెక్టర్‌ను శనివారం ఉదయం 10 గం.లకు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని పాఠశాల గదులను పరిశీలించారు. మండల ఎమ్మార్వై అమర్నాథ్‌రెడ్డి, విఆర్ఎ వినోద్, సర్పంచ్ జయలక్ష్మి, తిప్పయ్య, మండల బిజెపి అధ్యక్షుడు జి. శ్రీనివాసులు, డి. ఆనంద్, నక్క నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ఉద్యమకారుడి జన్మదిన వేడుకలు



కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే

**వంగూరు, జూలై 15 ప్రభాతవార్త:**మలిదశ తెలంగాణ ఉద్యమ కారుడు, కల్వకుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మందా రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు సమక్షంలో కస్తూర్బా గాంధీ పాఠశాలలోని విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డిని శాలువాలతో సన్మానించి కేక్‌ను కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు కాంపల్లి దేవ మండల బీఆర్ఎస్ నేతలు తదితరులు ఉన్నారు.

## దశదినకర్మ కార్యక్రమంలో పలువురు నేతలు...



**వంగూరు, జూలై 15 ప్రభాతవార్త:**వంగూరు గ్రామ మాజీ సర్పంచ్ గణేష్‌రావు మాతృమూర్తి మాజీ సర్పంచ్ సర్పంచ్ వేనెపల్లి లక్ష్మమ్మ దశదినకర్మ కార్యక్రమంలో ఎంపీ రాములు, ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో పాటు పలువురు నేతలు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ లక్ష్మమ్మ పరలోకాలకు వెళ్లడం బాధకరమని, ఆమె లేని లోటు తీరనిదని వారు పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు కల్పించాలన్నారు. అనంతరం గణేష్‌రావును పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు నేతలు తదితరులు ఉన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కల్వకుర్తి, జూలై 15 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని 8వ వార్డులో నుంచి గచ్చుబావి రోడ్డు వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వార్డు నెం. 20లో కమలయ్య ఇంటి నుంచి పాపయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసుల కోరిక మేరకు పలు కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని ఆయన తెలిపారు. కల్వకుర్తి పట్టణ అభివృద్ధికి అహర్నిలు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, కౌన్సిలర్లు గోపిరెడ్డి లక్ష్మిరాంరెడ్డి, పద్మ, సైదులు, ఏఈ శివకృష్ణ, నాయకులు గోపిరెడ్డి చిన్న రాంరెడ్డి, ఎన్.శ్రీనివాసులు, శేఖర్, సూరి, మల్లయ్య, శేఖర్, సిబ్బంది ఉన్నారు.

## గడప గడపకు బీజేపీ కార్యక్రమాలు...



**వెల్దండ, జూలై 15 ప్రభాతవార్త:**మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రధానిమోడీ గత 9సంవత్సరా లుగా చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించేందుకు గడప గడపకు శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగానే నగరగడ్డ తాండ, చెదురుపల్లి గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి పాల్గొని ప్రధాని మోడీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచాయని, ప్రతి ఒక్కరు మోడీ పాలనపై హర్షం వ్యక్తం చేస్తున్నారని పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు.

**గ్రామ పంచాయతీ కార్మికులకు సంఘీభావం..**గ్రామ పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మె శిబిరాన్ని తల్లోజు ఆచారి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, కార్మికులు ఎదుర్కొంటున్న మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి జీవో 60 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం జీతాలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు విజయేందర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, మోహన్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాసాచారి, రవికుమార్, యాదగిరి, పరమేష్‌గౌడ్, యాదయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## గోరింటాకుతో ఆరోగ్యం..

**- 24వ వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి - మన సేవా సమితి ఆధ్వర్యంలో మెహందీ పోటీలు**



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 15, ప్రభాతవార్త :** ఆడవారికి అత్యంత ఇష్టమైనది గోరింటాకు అని , అందులో ఆరోగ్యకరమైన అంశాలు ఎన్నో ఉన్నాయని 24వ వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో మన సేవా సమితి ఆధ్వర్యంలో ఆషాఢమాసం వేడుకల్లో భాగంగా మెహందీ పోటీలు నిర్వహించారు. ఈ వేడుకలకు వార్డు కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆషాఢ మాసంలో ఆడవారు చేతులకు మైదాకు పెట్టుకోవడం ఆనవాయితీ అని, ఇది మన సంస్కృ తి అని , ఇందులో ఎన్నో ఆరోగ్యకరమైన విషయాలు ఇమిడి ఉన్నాయన్నారు. ఆరోగ్యానికి సైతం ఎంతో మేలు చేస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్ననాటి నుంచే సంస్కృతి, సంప్రదా యాలపై నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మన సేవా సమితి అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపా ధ్యక్షుడు ఏ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రఘు, అంగన్‌వాడీ టీచర్ సంధ్య, స్థానికులు రాధాకృ ష్ణ, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మనెంట్ చేయాలి

**- సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు**



**వనపర్తి టౌన్,జూలై15,ప్రభాతవార్త:** తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జూలై 6 నుండి జరిగే సమ్మె 10వ రోజుకు చేరుకుంది. వనపర్తి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ... ఇది రాష్ట్రవ్యాప్త సమ్మె అని అందరూ గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె కొనసాగించాలని, అందరిని పర్మనెంట్ చేయాలని, కార్మికులకు జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని, కారోబార్ , బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సహజ మరణానికి ఇన్సూరెన్స్ పథకాన్ని ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం మొద్దు నిద్రను వీడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయని ఎడల రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు హన్మంత్ నాయక్, రామ్ చంద్రయ్య, శ్రీను, స్వామి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## శేషనాయక్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటాం...

**-ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి**



**వెల్దండ, జూలై 15 ప్రభాతవార్త:**వెల్దండ మండలం కుందారం తాండకు చెందిన శేషన్‌నాయక్ మృతి చెందడం ఎంతో బాధకరమని, గత కొన్ని నెలల క్రితం అనారోగ్యానికి గురైన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రూ.50వేలు అందించి ఆర్థిక సహాయం అందించారని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి గుర్తు చేశారు. శనివారం మృతుడి కుటుంబ సభ్యులను వరప్రసాద్‌రెడ్డి పరామర్శించి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దశరథ్‌నాయక్, కవిత సురేందర్, వరలక్ష్మి పంతునా యక్‌తో పాటు సురేష్‌రెడ్డి, వెంకట్‌నాయక్, జయరాంనాయక్, గన్యానాయక్, మురళి, దేవేందర్, లక్ష్మణ్, రమేష్, తారాసింగ్ తదితరులు ఉన్నారు.

## అల్లుని చేతిలో మామ హతం...



**మక్తల్,జూలై 15 ప్రభాతవార్త :** మద్యం మత్తులో మామ, అల్లుని మధ్య పొలం దగ్గర మాట మాట పెరిగి చేతిలో ఉన్న కట్టెతో మామ లక్ష్మప్ప (44) తలపై అల్లుడు మల్లేష్ కొట్టడంతో మామ మృతి చెందిన సంఘటన మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పసుపుల గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. సంఘటనలో లక్ష్మన్నది సహజ మరణమే అని గ్రామస్తులు,కుటుంబ సభ్యులు నమ్మించేందుకు ప్రయత్నించిన విషయం బహిర్గత కావడంతో మక్తల్ సిఐ రామ్‌లాల్ రాథోడ్, ఎస్సై పర్వతాలు సంఘటనకు చేరుకుని మృతుడి బావమరిది నరసప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టంకై శవాన్ని మక్తల్‌కి తరలించి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అయితే పసుపుల గ్రామానికి చెందిన ఉసెనమ్మకు సంతానం లేకపోవడంతో వారసుని కోసం 30 సంవత్సరాల క్రితం కర్ణాటకలోని పెద్ద కురుము గ్రామం నుంచి మృతుడు లక్ష్మప్పను దత్తత తీసుకోవడం జరిగింది. మగదిక్కు కోసం నిందితుడు మల్లేష్‌ను ఇల్లరికపు అల్లుడుగా తెచ్చుకోవడం విశేషం.

## లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం:ఎంఈఓ వెంకటయ్య



**నారాయణపేట ప్రతినిధి,జూలై 15 ప్రభాతవార్త :** సమాజ సేవ కొరకు లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని పల్లెపల్లెలో లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్‌గా లయన్ హరినారాయణభట్టడ్ మార్గదర్శకత్వంలో సమాజ సేవకొరకు ఓ సైనికుల్లా పనిచేస్తానని లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎంఈఓ వెంకటయ్య అన్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 320 ఏ గవర్నర్ హరినారాయణ్ భట్టడ్ ప్రమాణ స్వీకారం చేసినందున శనివారం సింగార్ బేస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వెంకటయ మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనార్ధన్, కార్యదర్శి సాయినాథ్, కోశాధికారి రవిగౌడ్, జి. నర్సింహులు, అమరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నయ్య, సీఆర్పీ ఆరిఫ్ హైమద్ ఐసిఆర్పీ శ్రీనివాస్, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు



**నవాబ్‌పేట,జూలై 15 ప్రభాతవార్త :** అజిలాపూర్ గ్రామంలో జడ్పీటిసి నిధుల నుంచి 2 లక్షలతో బోర్‌మోటార్‌ను వేయడం జరిగింది. హనుమాన్ ఆలయం దగ్గర బోరు వేశారు. కొండాపూర్ గ్రామంలో 15 లక్షలతో ఎమ్మెల్యే నిధుల నుంచి మట్టిరోడ్డు మంజూరు చేయడం జరిగింది. కార్యక్రమంలో ఎంపిపి అనంతయ్య, జడ్పీటిసి రవింద్రరెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ నర్సింలు, మార్కెట్ ఛైర్మన్ లక్ష్మన్న, వైస్ ఎంపిపి సంతోష్‌రెడ్డి, నవాబ్‌పేట సర్పంచ్ గోపాల్‌గౌడ్, ముడా డైరెక్టర్ గండు చెన్నయ్య, కొండాపూర్ సర్పంచ్ అజిలాపూర్ సర్పంచ్ టిఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ చౌకబారు మాటలు మానుకోవాలి..

**- రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే... - నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

**వంగూరు, జూలై 15 ప్రభాతవార్త:**సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి దశలో నడిపిస్తుంటే ఓర్వలేని కాంగ్రెస్ చౌకబారు మాటలు మాట్లాడుతూ దిగజారుడు తనాన్ని మానుకోవాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు సూచించారు. శనివారం వంగూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రైతాంగాన్ని అభివృద్ధి పర్చేందుకు ఉచిత విద్యుత్‌ను అందిస్తూ రైతుబంధు పథకం క్రింద ఎకరాకు రూ.6వేలు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరుస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన రైతు కుటుంబానికి అండగా ఉండేందుకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను అందిస్తూ రైతులకు అండగా ఉంటే కాంగ్రెస్ నాయకులు మతి భ్రమించి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని, విమర్శలు చేస్తే అభివృద్ధికి అకాంక్షించే విధంగా ఉండాలి కానీ కల్లబొల్లి మాటలు కాదని ఆయన హితవు పలికారు. దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు పథకం క్రింద రూ.10లక్షలను అందించి దళిత కుటుంబాలను అభివృద్ధి పరుస్తున్న విషయం గుర్తుకు లేదా అని ఆయన ప్రశ్నించారు. బీసీల అభివృద్ధి కోసం కులాల వారిగా పథకాలను ప్రవేశ పెట్టి ఆర్థిక సహాయాన్ని అందిస్తుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం కండ్లు మూసుకుపోయినట్లు వ్యవహరిస్తూ విమర్శలు చేయడం సబబు కాదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా నిలిపిన సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధిని చూసి మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన ఒరిగిందేమి లేదన్నారు.

# మా భూములకు పట్టాలివ్వండి...



భూములకు పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరుతున్న గిరిజన మహిళ



మాజీ ఎంపీటీసీ భీమయ్యగౌడ్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, జూలై 15 ప్రభాతవార్త:**మండల పరిధిలోని మర్రిగుంత తాండ పరిధిలో గల 1800 ఎకరాల పొలాలను గిరిజన కుటుంబాలు సేద్యం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని, మా పొలాలకు పట్టాలివ్వాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను వినతి పత్రం ఇచ్చి వేడుకున్నారు. మర్రిగుంతతాండ పరిధిలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేయడానికి విచ్చేసిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కలిసి మేము సాగు చేసుకుంటున్న పొలాలకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, పట్టాలు ఇప్పించి ఆదుకోవాలని మొర పెట్టుకున్నారు.

గ్రామంలో విద్యుత్ సరఫరా, మిషన్ భగీరథ నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను తీర్చడానికి కృషి చేస్తానని, పట్టాలు ఇవ్వడానికి అన్ని విధాల కృషి చేస్తున్నామని, త్వరలోనే జిల్లా కలెక్టర్‌తో కలిసి గ్రామంలో సమావేశం నిర్వహించి రైతులు మాట్లాడిన ప్రతి అంశాన్ని రికార్డు చేసి సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

**మాజీ ఎంపీటీసీని పరామర్శించిన ఎమ్మెల్యే...**

చెర్కూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భీమయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న భీమయ్యగౌడ్‌ను శనివారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ధ్యావ విజితారెడ్డి,ఎంపీపీ విజయ జైపాల్‌నాయక్, సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, వైస్ ఎంపీపీ శాంతిగోపాల్‌నాయక్, నాయకులు భాస్కర్‌రావు, నర్సింహ్మా ముదిరాజ్‌తోపాటు పలువురునాయకులు ఉన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించాలి

**- ప్రభుత్వం మీ అండగా ఉంది - జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి**



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి



సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

**వనపర్తి,జూలై15,ప్రభాతవార్త:** విద్యార్థులు స్వతహాగా చాలా ప్రతిభ కలవారని, వారు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని ఆ దిశగా కృషి చేస్తే అత్యున్నత శిఖరాలను అధిరోహించగలరని జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి అన్నారు. పెద్దమందడి మండల పరిధిలోని మనిగిల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శంకర్ గౌడ్ అధ్యక్షతన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గత సంవత్సరం రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో సీట్లు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ సంవత్సరం కూడా ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ... పేదరికం కారణంగా తల్లిదండ్రులు వారి విద్యాభ్యాసానికి అడ్డు కాకూడదని, ప్రతిభగల విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉందని, వారు ఉన్నత శిఖరాలకు చేరే వరకు ప్రభుత్వ తోడ్పాటు ఉంటుందని తెలియజేశారు. ఉన్నత పాఠశాలకు ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను తన సొంత డబ్బులతో ఏర్పాటు చేయిస్తానని విద్యార్థులకు తెలిపారు. సమావేశం అనంతరం పాఠశాల విద్యార్థులు చైర్మన్ తో మాట్లాడుతూ... తమ సమస్యలు తెలిపారు. పాఠశాల భద్రత విషయమై పోలీస్ శాఖ సహాయం తీసుకుంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ గౌడ్, జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, గాయకులు పెండెం నాగరాజు, గ్రామ కార్యదర్శి కృష్ణ నాయక్, ఉపాధ్యాయ బృందం వెంకటేశ్వర్లు గౌడ్, విష్ణువర్ధన్, నాగేశ్వరమ్మ, సురేంద్రనాథ్, చంద్రకళ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయండి

**- సీపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి**



పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

**వనపర్తి రూరల్,జూలై15,ప్రభాతవార్త:** టీఎస్‌సీపీఎస్‌ఈయు వనపర్తి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజేందర్ గౌడ్ పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రకు సంబంధించిన గోడపత్రికను సీపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి మాట్లాడుతూ... తెలంగాణరాష్ట్రంలో ఒక లక్ష 80వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయులు అందరికీ సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతు ఈనెల 16 నుండి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల గుండా టీఎస్‌సీపీఎస్‌ఈయు రథయాత్ర చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ యాత్ర జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రారంభమై ఈనెల 16న సాయంత్రం 5 గంటలకు జిల్లాలోకి అడుగు పెడుతుందని, ఆ రోజున జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగ ఉపాధ్యాయులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానం రద్దు చేసే వరకఉ తమ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. సీపీఎస్ ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, కోశాధికారి సాయిచందర్ రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తేనేటి రవి, మధు, సోని కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నెరవేరుతున్న 30 యేండ్ల పట్టణ ప్రజల చిరకాల వాంఛ..

**- మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్**



రోడ్డు మధ్యలో చెట్లను నాటుతున్న ప్రజాప్రతినిధులు

వనపర్తి టౌన్,జూలై15,ప్రభాతవార్త:అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనపర్తి పట్టణ కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్ల మధ్యలో సెంట్రల్ లైటింగ్ , ఆధునాతనమైన చెట్లను నాటారు. మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మార్కెట్ చైర్మన్ రమేష్ గౌడ్ లు ఎమ్మెల్యే కార్యాలయం నుండి రాజీవ్ చౌరస్తా వరకు రోడ్ల మధ్యలో చెట్లను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ మాట్లాడుతూ... 30 యేండ్లుగా ఉన్న వనపర్తి ప్రజల చిరకాల వాంఛ అయిన రోడ్డు విస్తరణ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి అటు పేద ప్రజలను ఇటు ఉన్నత వర్గాలను ఒప్పించి రోడ్ల విస్తరణ పనులను వేగంగా పూర్తి చేసి సుందరీకరణ పనులు చేపట్టారని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిన సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి, కేటీఆర్, కేసీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, ఏఈ భాస్కర్, మున్సిపల్ కౌన్సిలర్ బండారు కృష్ణ, కాగితాల లక్ష్మినారాయణ, నందిమల్ల భువనేశ్వరి శ్యామ్, రహీం, ఎల్ఐసి కృష్ణ, పాకనాటి కృష్ణ, వినోద్‌గౌడ్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, శివ గౌడ్, నాగన్న, గోపాల్ యాదవ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 25న అమరచింతలో బోనాల పండుగ

**అమరచింత,జూలై15,ప్రభాతవార్త:** అమరచింత పట్టణంలోని శ్రీకృష్ణ నగరంలో వెలసిన పోచమ్మ బోనాల పండుగ నిర్వహణ కమిటీ శనివారం పోచమ్మ దేవాలయం ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు తాటికొండ రమేష్, ఏకే వెంకటేష్ రెడ్డి మాట్లాడుతూ... ఈనెల 25న అమరచింత పట్టణంలో బోనాల పండుగ నిర్వహిస్తున్నామని ఈ వేడుకలకు అమరచింత పట్టణంలో భక్తులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 25వ తేదీన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణయ్య, చిన్న బుచ్చన్న, శివన్న, రాజు, కంకలి రవి, బాబన్న, విమలన్న, విష్ణు, వెంకటన్న, శ్రీను, వీరితో పాటు వివిధ కుల సంఘాలకు చెందిన వారు పాల్గొన్నారు.



అమరచింత పట్టణంలో పోచమ్మ దేవాలయంలో ఆలయ కమిటీ సమావేశం

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 15, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు శాంతినగర్‌లో గత వారం రోజులు కిందట కావలి రా ములు (65) అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ పరిస్థితి దృష్ట్యా వార్డు కౌన్సిలర్ మున్సిపల్ చైర్ పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్ దృష్టికి తీసుకెళ్లడంతో బాధిత కుటుంబానికి శనివారం పరామర్శించారు. అనంతరం ఎమ్మె ల్యే లక్ష్మారెడ్డి సహకారంతో రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్ర మంలో కౌన్సిలర్ చైతన్య చౌహాన్, నాయకులు కుమార్, ఆనంద్, జగన్ , పార్వతమ్మ, మల్లేష్ పాల్గొన్నారు.

## నర్సరిని పరిశీలించిన సర్పంచ్,వార్డుసభ్యులు..



**దేవరకద్ర,జులై15 ప్రభాతవార్త:**దేవరకద్ర గ్రామపంచాయతీ నర్సరిని శనివారం సర్పంచ్ కొండ విజయలక్ష్మి,ఈఓ సీత్యానాయక్,వార్డు సభ్యులు రాము,బాల్‌రాజ్‌లు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు నర్సరిలో పెంచే మొక్కలపై చర్చించారు.అలాగే స్థానిక గ్రామపంచాయతీలో స్వచ్ఛత కొరకు ప్రతిజ్ఞ చేశా రు.ఈ కార్యక్రమంలో కూడ సర్పంచ్ కొండ విజయలక్ష్మి,ఈఓ సీత్యానాయక్,వార్డుసభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బండహన్మిరెడ్డి,గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మప్ప స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం



**మల్దకల్,జులై 15 ప్రభాతవార్త :** మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఉదయం వాల్మీకి పూజారులు, అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.దేవాలయ ఛైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో తిమ్మనదొడ్డి గ్రామానికి చెందిన కొండయ్య దంపతులు వారి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా అర్చకులు మధుసూధనాచారి, రవిస్వామి వారికి పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నాదానం నిర్వహించారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, వీరారెడ్డి, పద్మారెడ్డి, చంద్రశేఖర్‌రావు, హనుమన్న, ధర్మన్న పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ రికవరీ బాధితునికి అప్పగింత:సిఐ రవిబాబు



**నారాయణపేట ప్రతినిధి,జులై 15 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని మడి ఏరియాకు చెందిన టి. సచిన్ అనే వ్యక్తి తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకొని నారాయణపేట పోలీసుల సహాయంతో సిఈఐఆర్ నూతన పోర్టల్‌లో దరఖాస్తు చేయగా సిఐ రవిబాబు ఆదేశాల మేరకు క్రైమ్ పోలీసులు శివ, రాము, సిఐఈఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ రికవరీ చేశారు. సిఐ రవిబాబు, ఎస్సై వసంత బాధి తునికి మొబైల్ అందించడం జరిగింది. ఈసందర్భంగా సిఐ రవిబాబు మాట్లా డుతూ ప్రజలు ఎవరైనా తమ సెల్‌ఫోన్ దొంగిలించబడిన లేదా పోగొట్టుకు న్నట్లయితే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నంబర్‌ను వెబ్‌సైట్‌లోకి అందులో పూర్తి వివరాలు పొందుపరచాలని అలా చేసినట్లయితే త్వరగా వారి మొబైల్స్ ని పట్టుకోవడం జరుగుతుందన ప్రజలు సీఈఐఆర్ నూతన దరఖాస్తు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

## ఎరువులపై నియంత్రణేదీ.!?

**ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న విక్రయదారులు..**

**ఆవేదనలో రైతన్నలు..చోద్యం చూస్తున్న అధికారులు..**

**భూత్పూర్, జులై 15 ప్రభాతవార్త :** ఆరుగాలం శ్రమించి మనకు అన్నంపెట్టి దేశానికి వెన్నముకలా నిలుస్తున్న రైతన్నకు అడుగడుగునా మోసం జరుగుతోంది. విత్తనాలు కొనుగోలు మొదలుకుని పండించిన పంట వరకు అడుగడుగునా మోసాలే. అక్షరాభ్యాస లేమిని గ్రహిస్తున్న విత్తన విక్రయదారులు నకిలీ విత్తనాల్ని అమాయకులైన రైతులకు అమ్ముతూ నిలువునా ముంచుతున్నట్లు రైతుల ద్వారా తెలుస్తోంది. విత్తనాల మాటటుంచితే నారుమడుల్లో వేసే డిఎపి, యూరియా ఎరువుల ధర అయితే ఇంకా చెప్పనక్కర్లేదు. ముఖ్యంగా యూరియా ధరను కొందరు విక్రయదారులు అదునుచూసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో యూరియా బస్తా వెంబడి ఎమ్మార్పీ ధర కంటే రూ. 20 నుండి రూ. 25 వరకు అధిక ధరలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూత్పూర్ పట్టణంలో ఉన్న నాలుగైదు ఎరువుల దుకాణాలలో నిత్యం ఇదే తంతు జరుగుతున్నట్లు, ఎరువుల దుకాణాలపై నియంత్రణ లేకనే విక్రయదారుల ఆగడాలకు అడ్డు, అదుపు లేకుండా పోతోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఎరువుల దుకాణాలపై విస్తృత దాడులు నిర్వహించి అధిక ధరలకు విక్రయించే దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుని దోపిడిని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

## కళాకారుల గుడిసెలు తొలగింపు..

**అలా ఇచ్చారు ఇలా తొలగించారు**



**ఉండవెల్లి, జులై 15 ప్రభాతవార్త :** ఉండవెల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులోని సర్వే నంబర్ 261/ఆ లోని 2.20 గుంటల కళాకారులకు కేటాయించిన భూమిలో లబ్దిదారలు గుడిసెలు వేసుకున్నారు. భూమి వివాదాస్పదంగా ఉండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భారీ బందోబస్తు నడుమ యంత్రాలతో కొట్టాలను పోలీసులు తొలగించారు. కళాకారులు మాకు తెలియకుండా ఎలా తొలగిస్తారని తహసిల్దార్‌పై మండిపడ్డారు. కళాకారుల సంఘం అలంపూర్ తాలూకా వారికి ఫైల్ నంబర్ ఆర్ఓఆర్/169/200 మండల తహసిల్దార్ నిర్ధారించారు. కళాకారుల సంఘం వారి జీవన ఉపాధి కొరకు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాం. అట్టి వారికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసువారి పూరి గుడిసెలను తొలగించారు. రంగస్థల కళాకారుల సంఘం వారికి చెందిన భూమి మాకు చెందేలా చేయాలని జిల్లా కలెక్టర్, మండల తహసిల్దార్‌లను డిమాండ్ చేశారు.

## అరణేశ్వరస్వామి ఆలయంలో పల్లకిసేవ..

**ఆంజనేయస్వామి దేవాలయంలో చివరిరోజు భాగవత సప్తహం పారాయణం**



**ధరూర్, జులై 15 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కోతులగిద్ద గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ కమిటి సభ్యులు శ్రీనివాస్‌రావు, శ్రీ మధాంధ్ర భాగవతసప్తాహం చివరి రోజు పారాయణం కొనసాగుతుంది. దశమస్కంధం ఉత్తరభాగం, ఏకాదశ స్కంధంలో భగవానుడు పరమాత్ముడు నారాయణుడు అనేక ధర్మాలను బోధించాడు. కలియుగము నందు భాగవతం అంత:కరణమును పవినరతమొనర్చును. చదివిన, విన్నవారికి శ్రీ మహా విష్ణువు అనుగ్రహం కలిగి కామితార్థాలు నెరవేరుతాయని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ధర్మారెడ్డి తెలిపారు. అరణేశ్వరస్వామి ఆలయంలో పల్లకిసేవ నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ కమిటి సభ్యులు శ్రీనివాస్‌రావు దంపతులకు సన్మానం చేశారు. హిందూ ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమానికి గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు శ్రీనివాస్‌రావు, సంజీవయ్య, సత్యప్రకాష్, సోమనాథ్‌రెడ్డి, తిమ్మారెడ్డి, బలరాం, రాఘవేంద్ర, జయన్న, హరి, ఈశ్వరయ్య, సతీష్, నరసింహులు, పారాయణం చేయగా గ్రామపెద్దలు శ్రీనివాసరావు, ఆంజనేయరెడ్డి, రామయ్య శెట్టి, ఆటో రాములు, మాజీ సర్పంచ్, రంగప్ప, కె. రంగన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ



**భూత్పూర్, జులై 15 ప్రభాతవార్త :** ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సిపిఎస్ పెన్షన్ విధానానికి స్వసిత చెప్పి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ చాలా కాలంగా సిపిఎస్ఈయు చేపట్టిన పా పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్లను శనివారం యూనియన్ నేతలు భూత్పూర్ శివారులోని కొత్త కలెక్టరేట్ ఆవరణలో ఆవిష్కరించారు. ఆవిష్కరణలో ప్రధానంగా ఆరు ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆవిష్కరణకు ప్రతినిత్యం వహించిన సిపిఎస్ ఈయు జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి మాట్లాడుతూ సిపిఎస్ ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులు చాలావరకు నష్టపోతున్నారని పలుమార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నప్పటికి ఫలితం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈనెల 16న జోగులాంబ గద్వాల జిల్లా నుండి ఆరంభించి సాధన సంకల్ప రథయాత్ర తెలంగాణ 33 జిల్లాల్లో నిర్వహించిన అనంతరం సాధన సంకల్ప రథయాత్ర ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో ప్రవేశిస్తుందని, ఈనెల 31న యాదాద్రిలో రథయాత్ర ముగుస్తుందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా యాత్రకు జిల్లా నుండి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, సభ్యులు అధిక సంఖ్యలో హాజరు కావాలని, ఇదేవిధంగా యాదాద్రిలో ఈనెల 31న జరిగే ముగింపు సభకు అత్యధికంగా హాజరు కావాలని కోరారు.

## పదవరోజు కొనసాగిన పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

**ఇటిక్యాల, జులై 15 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని, అలాగే ప్రత్యేక జిఓ ప్రకారం వేతనాలు చెల్లించాలని, తమ పనికి సమాన వేతనం చెల్లించాలని విధి నిర్వహణలో మరణిస్తే 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన కార్మికుల సమ్మె శనివారంతో పదవరోజుకు చేరుకుంది. మండల పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా శనివారం 10వ రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు ప్రభుత్వానికి పెట్టిన అన్ని డిమాండ్లను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. అప్పటివరకు సమ్మె నిరంతరం కొనసాగిస్తామని నినాదాలు చేస్తూ ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, మహిళా పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతినెల మూడవ శనివారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్..



**ఉట్కూర్, జులై 15 ప్రభాతవార్త :** నిడుగుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మండల విద్యాధికారి వెంకటయ్య మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వీరి మధ్య అవగాహన మెరగుపరచడానికే ప్రతినెల మూడవ శనివారం తెలంగాణ విద్యాశాఖ ఆదేశానుసారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పిటిఎం) సమావేశం ముఖ్య ఉద్దేశ్యమని మండల విద్యాధికారి వెంకటయ్య అన్నారు. పిల్లల కార్యకలాపాలు అభ్యాసం ప్రవర్తన గురించి ఏవైనా అభిప్రాయాలు సమస్యలు సమాచారం, ప్రశంసలను స్వేచ్ఛగా పంచుకోవడానికి వీలుగా ఈ పిటిఎం సమావేశాన్ని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు వారధిగా చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు అయ్యేటట్లు తల్లిదండ్రులు చూడాలని వారికి ఉపాధ్యాయులు అప్పజెప్పిన హోంవర్క్, సబ్జెక్టులకు సంబంధించిన అసైన్మెంట్ పనులను ఇంటి దగ్గర తప్పకుండా విద్యార్థులు చేసుకునేటట్లు తల్లిదండ్రులు చూడాలని ఈ సందర్భంగా వారు కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే భాగంలో తెలంగాణ విద్యాశాఖ తొలిమెట్టు, ఇంటింట చదువుల పంట మన ఊరు మనబడి, బాలసభ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు సమాంతరంగా తల్లిదండ్రుల సహకారం ఉంటేనే విద్యార్థులలో సంపూర్ణ అభివృద్ధి సాధ్యం అవుతుందని ఇరువురు ఒక జట్టుగా ఉండి ముందుకు వెళ్లాలని అన్నారు. సమావేశంలో మండల విద్యాధికారి వెంకటయ్య, ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, ఎస్ఎంసి కమిటి సభ్యులు నర్సింహులు, మక్బుల్‌ఖాన్, ఉపాధ్యాయులు పద్మ, సునిత, వెంకటప్ప, సుజాత, సలాం, లియాఖత్, ఆంజనేయులు, శ్రీనివాస్‌లతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 15, ప్రభాతవార్త :** టిఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని నూతన కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల ఉద్యోగులతో కలిసి పాతపెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి మాట్లాడుతూ పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో ఆదివారం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నుంచి రథయాత్ర ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈయాత్ర రాష్ట్రంలోని 33జిల్లాలను కలుపుతూ మహబూబ్‌నగర్ జిల్లాలోకి జూల30న ప్రవేశిస్తుందని, జూలై31న యాదాద్రి భువనగిరిజిల్లాలో ముగుస్తుందని తెలిపారు. యాత్రలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు వేలాదిగా పాల్గొనాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పాత పెన్షన్ సాధించుకోవాలని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు ఉద్యమం ద్వారానే సాధ్యమవుతుందని, అం దుకే ఆగస్టు12న చలోహైదరాబాద్ కార్యక్రమానికి కూడా టీఎస్‌సీపీఎస్‌ఈయూ పిలుపునిచ్చింద న్నారు. జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, నాయకులు కృష్ణకుమార్ గౌడ్, గోవర్ధనాచారి, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలి..

- 9 సం.ల కాలంలో రాష్ట్రంలో అగ్రభాగాన నిలిచిన ఫ్రెండ్లీ పోలీస్
- ఇరువురి వాదనలు విన్న తరువాత పారదర్శకంగా సమస్య పరిష్కరించాలి : ఎస్పీ రక్షిత కె.మూర్తి



నెలవారీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రక్షిత

**వనపర్తి , జులై15, ప్రభాతవార్త:** పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలని , 9 సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీస్ అగ్రభాగాన నిలిచిందని జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. శనివారం జిల్లాలోని డీఎస్పీ, వనపర్తి సీఐ, కొత్తకోట సీఐ, ఆత్మకూరు సీఐ, అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్ఐలతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. గడిచిన ఆరు నెలల కాలంలో నమోదైన కేసులను , ప్రస్తుత సంవత్సరం గడిచిన ఆరు నెలల కాలంలో నమోదైన కేసులతో సరిపోల్చి వివిధ ఆదేశాలు ఇచ్చారు. వివిధ పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్‌లో కేసులు వెంటనే విచారణ పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలతో మమేకమై పని చేయాలని బాధితులు ధైర్యంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే విధంగా పని వాతావరణం ఉండాలని ఆమె సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఇరువర్గాల ఫిర్యాదులను ఇరువురి వాదనలు విన్న తరువాత పారదర్శకంగా సమస్య పరిష్కరించాలని ఆమె సూచించారు. చట్టాన్ని చేతిలోకి తీసుకునే హక్కు ఎవరికీ లేదని, వివాదాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఆమె కోరారు. పోలీస్ స్టేషన్‌కు వస్తే న్యాయం జరుగుతుందనే భావనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆమె సూచించారు. వనపర్తి జిల్లా పోలీసులు తీసుకుంటున్న చర్యల వల్ల జిల్లా పరిధిలో వివిధ నేరాల శాతం చాలా తగ్గిందని ఎస్పీ గుర్తు చేశారు. మైనర్ డ్రైవింగ్ సరైన నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాల కోసం ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అటువంటి వాహన యజమానుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళల భద్రత కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, వారి ఫిర్యాదుల పట్ల సత్వరమే స్పందించి తగిన విధంగా న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటున్న ఆమె తెలిపారు. ఈ సమావేశంలో వనపర్తి డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, వనపర్తి సీఐ మహేశ్వర్, కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఆత్మకూరు సీఐ రత్నం, వనపర్తి జిల్లాలోని ఎస్ఐలు, డీపీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలలో ఇంటి స్థలాల లబ్దిదారుల రెండవ జాబితా ఏర్పాటు..



ఇంటి స్థలాల రెండవ జాబితాను గ్రామస్తులకు వివరిస్తున్న తహసిల్దార్

**ఇటిక్యాల, జులై 15 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వల్లూరు, ఉదండాపూర్, షాబాద్ గ్రామాలలో ఈనెల 11వ తేదీన రెండవసారి విచారించిన అధికారులుఎంపిక చేసిన ఇంటి స్థలాల లబ్దిదారుల జాబితాను శనివారం తహసిల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపిడిఓ రాఘవ, ఆర్ఐ ప్రశాంత్‌గౌడ్, షాబాద్, ఉదండపురం గ్రామాలలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నోటీసు బోర్డుపై ఉంచారు. పై గ్రామాలలో 18 ఏళ్ల క్రితం నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు రైతుల నుండి గతంలో ఉన్న ప్రభుత్వం భూములను కొనుగోలు చేసింది. ఇప్పటివరకు ఆ భూములలో ఇంటి స్థలాలు పంచకపోవడంతో గతనెల తెలంగాణ రాష్ట్ర దశాబ్ద ఉత్సవాలలో భాగంగా నిరుపేదలకు ఇంటి స్థలాలను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్దమైంది. అందులో భాగంగా గతనెల మొదటివారంలో ప్రజల నుండి దరఖాస్తులు తీసుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణకు అధికారులను ఏర్పాటు చేయగా విచారణ అధికారులు వారి ఇళ్లకు వెళ్లి లబ్దిదారుల స్థితిగతులను పరిశీలించారు. అనంతరం ఈనెల 5వ తేదీన మొదటి ఇంటి స్థలాల లబ్దిదారుల జాబితాను పై మూడు గ్రామాలలో అధికారులు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ప్లాట్లు లేని లబ్దిదారులు జాబితాలో మా పేర్లు లేవని అధికారుల దృష్టికి తీసుకుపోగా ఈనెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు గతంలో దరఖాస్తు చేసిన వారి నుండి తిరిగి రెండోసారి దరఖాస్తులను తీసుకున్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటి స్థలాల లబ్దిదారుల విచారణకు మూడు గ్రామాలకు షాబాద్ గ్రామానికి జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి ప్రియాంక, ఉదండాపురం గ్రామానికి ఈఈ శ్రీధర్‌రెడ్డి పలువురు గ్రామానికి వాటర్ గ్రిడ్ పథకం ఈఈ భీమేశ్వర్‌ను కేటాయించారు. కేటాయించిన అధికారులు గ్రామాలకు వెళ్లి రెండోసారి దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. విచారణ అనంతరం షాబాద్ గ్రామంలో మొదటిసారి ఎంపిక చేసిన జాబితాలో 58 మంది లబ్దిదారులు ఉండగా రెండోసారి అర్హులైన లబ్దిదారులకు 69 మందిని ఎంపిక చేశారు. అలాగే ఉదండాపురం గ్రామంలో మొదటిసారి జాబితాలో 122 మంది లబ్దిదారులను ఎంపిక చేయగా రెండోసారి విచారించిన అధికారులు 7మంది లబ్దిదారులను అర్హులుగా ఎంపిక చేశారు. వోల్వూరు గ్రామంలో మొదటిసారి ఎంపిక జాబితాలో 136 మందిని ఎంపిక చేయగా రెండోసారి ఎంపిక జాబితాలో 2 ఇద్దరిని ఎంపిక చేశారు. పై మూడు గ్రామాలలో ఇంటి స్థలాలు ఇచ్చేందుకు లబ్దిదారులను ఎంపిక చేయగా ప్రభుత్వం నిర్ణయం మేరకు ఎంపిక చేసిన ఇంటిస్థలాల లబ్దిదారులకు పట్టాలు ఇచ్చే అవకాశం ఉంది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, సరస్వతి, ఎంపిటిసి తిరుపతిరెడ్డి, సర్పంచ్ అయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సీనియార్టీ ప్రకారం విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి..

**తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి: స్థాయి సంఘాల సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 15 ప్రభాతవార్త :** వ్యవసాయ విద్యుత్‌కనెక్షన్లు సీనియార్టీ ప్రకారం ఇవ్వాలని జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం తన చాంబర్‌లో నిర్వహించిన ఏడవస్థాయి సంఘం (నిర్మాణ పనులు) సమావేశంలో గండీడ్ జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, నవాబ్‌పేట జడ్పీటిసి అరవిందరెడ్డితో కలిసి సమీక్షించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు దరఖాస్తు సీనియార్టీ ప్రకారం ఇవ్వాలని, వ్యవసాయ కనెక్షన్లకు మెటీరియల్ కొరత లేకుండా చూడాలన్నారు. వర్షాలు ఆలస్యం అయినందున విద్యుత్ డిమాండ్ పెరిగిందన్నారు. గాలి దుమారానికి స్తంభాలు ఒరిగిన వైర్లు తెగిపోయినట్లైతే వెంటనే సరి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సబ్ స్టేషన్‌లలో సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించుకోవాలని అన్నారు. పంచాయతీరాజ్ రోడ్ల కాలం తగ్గుతుందని తొందరగా పాడవుతాయని, కేజీ వీల్‌తో, ట్రాక్టర్లు నడిపే వాళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం తన చాంబర్‌లో నిర్వహించిన ఒకటవ స్థాయి సంఘం (ప్రణాళిక, ఆర్థిక) సమావేశంలో మూసాపేట జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్, దేవరకద్ర జడ్పీటిసి అన్నపూర్ణతో కలిసి సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్న తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని, గ్రామాలలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీల వల్ల నీరు కలుషితం అవుతున్న చోట వెంటనే మరమ్మతు చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. 15 రోజులకు ఒకసారి తగు నీటి ట్యాంకులు శుభ్రం చేసే విధంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మనెంట్ చేయాలి..

**- సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు**

**పెద్దమండడి జూలై15, ప్రభాతవార్త:** తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జూలై 6 నుండి జరిగే సమ్మె శనివారం 10వ రోజుకు చేరుకుంది. పెద్దమండడి మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు సాంబశివుడు మాట్లాడుతూ.... ఇది రాష్ట్ర వ్యాప్త సమ్మె అని, అందరూ గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మెలో పాల్గొంటున్నారని, అందరినీ పర్మనెంట్ చేయాలని, కార్మికులకు జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సహజ మరణానికి ఇన్సూరెన్స్ పథకాన్ని ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తు 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని, వారాంతపు సెలవులు, పండుగ సెలవులు, జాతీయ అర్జిత సెలవు దినాలను అమలు చేయాలని, ట్రాక్టర్ డ్రైవర్స్‌కు పంచాయతీల ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలని, ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వారన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి అన్ని రకాల కార్మిక చట్టాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయని ఎడల రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించి పంచాయతీ కార్మికులను ఆదుకోవాలని గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో వేలాదిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు మండల అధ్యక్షులు వెంకటయ్య, కార్యదర్శి గట్టమ్మ, నాయకులు నిరంజన్, రేణుక, సుందరయ్య, శాంతయ్య పాల్గొన్నారు.

# కష్టపడే తత్వం అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చు

**వనపర్తి టౌన్, జులై15, ప్రభాతవార్త:** మంచి ప్రవర్తన కష్టపడే తత్వం అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చు అని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రవికుమార్ అన్నారు. వనపర్తి పట్టణంలోని ప్రతిభ ఉన్నత పాఠశాలలో చట్టాలపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థిని విద్యార్థులు చట్టాలపై ఇప్పటి నుండే సరైన అవగాహన కలిగి ఉండాలని లేనిపక్షంలో అనేక రకాలైన కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని లేనిపక్షంలో మీ బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని, ప్రస్తుత పరిస్థితులలో ఎవరిని అంతా సులభంగా నమ్మవద్దని కొత్త వారితో జాగ్రత్తగా మసలుకోవాలని తల్లిదండ్రులు గురువుల పట్ల గౌరవం కలిగి ఉండాలని వారు చెప్పే ప్రతి మాట మీ యొక్క భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చెబుతారని , మీరు తప్పనిసరిగా విధేయత కలిగి ఉండాలని తెలిపారు. డిప్యూటీ లీగల్ ఏడ్ కౌన్సిల్ ఉత్తరయ్య మాట్లాడుతూ... విద్యార్థులు అంటే కల్లాకపటం ఎరుగని వారు అని, వారిపై విద్యార్థి దశలోని చెడు ప్రభావాలు దరిచేరే ప్రయత్నం చేస్తుంటాయని, వాటికి సాధ్యమైనంత మేర దూరంగా ఉంటే విద్యార్థి భవిష్యత్తు ఉజ్వల భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవచ్చని, విద్యార్థులైన మీరు కష్టపడి చదివి మీ యొక్క తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రకాష్ బాబు మాట్లాడుతూ... న్యాయమూర్తులు పాఠశాలకు వచ్చి చట్టాలపై అవగాహన కలిగించడం చాలా సంతోషించదగ్గ విషయమని , ఇటువంటి కార్యక్రమాలు సమాజ మార్పుకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రతిభ పాటిల్ , వైస్ ప్రిన్సిపాల్ రమేష్ నాయక్, కోర్టు సిబ్బంది నాగరత్నమ్మ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# మీరే ప్రపంచాన్ని మార్చగలరు
# పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణా సందేశం



విద్యార్థులకు ప్రేరణ ఉపన్యసిస్తున్న విశ్రాంత జిహెచ్‌ఎం

**చిన్నచింతకుంట, జులై 15 ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థిలోనూ గొప్పశక్తి దాగి ఉందని దానిని వెలికితీసి సద్వినియోగం చేసుకుంటే ప్రపంచాన్ని మార్చవచ్చని విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు ఎం. సుదర్శన్ అన్నారు. శనివారం కౌకుంట్ల మండలం అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తొమ్మిది, పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కొన్ని భయాలు ఉంటాయని వాటిని తొలగించుకుని భవిష్యత్తు వైపుకు అడుగులు వేయాలని సూచించారు. ప్రతి అపజయం ద్వారా కూడా ఎంతో నేర్చుకుంటామని అపజయాలకు భయపడాల్సి వస్తే విజయతీరాలను చేరుకోలేరన్నారు. విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధించగలరని, ప్రపంచం ప్రతిభ ఉన్న వ్యక్తులను కోరుకుంటుందని గొప్ప వ్యక్తులుగా నిలవాలంటే ప్రణాళిక బద్దంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు తాను కృషి చేస్తున్నానని ఆయన అన్నారు. ప్రతిరోజు ధ్యానం చేయాలని ధ్యానం ద్వారా ఏకాగ్రత సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ధ్యానం చేయించారు. ధ్యానంలోని అద్భుతాలను విద్యార్థుల ముందు ప్రదర్శించి అబ్బురపరిచారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ. రామకృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గుముడాల చక్రవర్తిగౌడ్, రవిశంకర్, శ్రీనివాసులు, ఎల్లయ్య, అనురాధ, సాదియా, ఫర్హత్ పాల్గొన్నారు.

## పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసిన సర్పంచ్ రవి



**ఇటిక్యాల, జులై 15 ప్రభాతవార్త :** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎంపి రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ దగ్గర అలంపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రవల్లి సర్పంచ్ రవి కలిశారు.

## కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం

**శ్రీరంగాపురం, జులై15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగసానిపల్లి గ్రామంలో చింతకుంట ఆంజనేయస్వామి టెంపుల్ రోడ్డుకు రెండు కోట్ల 10 లక్షలు మంజూరు చేయించిన మంత్రి నిరంజన్‌రెడ్డి , సీఎం కేసీఆర్ చిత్ర పటాలకు నాగసానిపల్లిగ్రామంలో శనివారం సర్పంచ్ ఆంజనేయులు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా సర్పంచ్‌ఆంజనేయులు మాట్లాడుతూ... మంత్రి నిరంజన్‌రెడ్డి ఇప్పటికే గ్రామానికి చాలా పనులు చేశారని, ఈ మధ్యనే నాగసానిపల్లి నుండి వెంకటాపురం వరకు బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయని, నాగసానిపల్లి నుండి శ్రీరంగాపురం వరకు రోడ్డు మరమ్మతులు జరుగుతున్నాయని, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులు, మంత్రి సహకారంతో చేయడం జరిగిందని , ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరపున మంత్రి నిరంజన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు రామకృష్ణ, ఉపాధ్యక్షులు రాఘవేందర్, నాగరాజు, చిరంజీవి, లోకేష్ నాయుడు, రాజు యాదవ్, రాముడు, అంజి, బాబు, బాలకృష్ణ, రామచంద్రి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన ఎంపీటీసీ

**పీపనగండ్ల, జులై15, ప్రభాతవార్త:** పీపనగండ్ల ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, కల్వరాల సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి వివిధ సమస్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... కొత్తకోటకు తరలించిన గురుకుల పాఠశాలను పీపనగండ్ల మండల కేంద్రానికి తీసుకురావాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పీపనగండ్ల గ్రామంలో కల్వరాల గ్రామంలో జరిగిన వివిధ అభివృద్ధి పనుల గురించి వివరించారు.

## కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి..

**సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు**

**లింగాల, జులై 15 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ కార్మికులు గత పదిరోజుల నుండి సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోడం సరికాదని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు అన్నారు. జిల్లా కేంద్రం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు శనివారం సిఐటియు ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో కార్మికుల సేవలు గొప్పవని అన్నారు. కార్మికులకు ఎంత జీతం ఇచ్చినా తక్కువేనని అన్నారు. కార్మికులకు కనీసం వేతనం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి అన్నారు. కార్మికులు గత పది రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేష్, కార్మికుల సంఘం మండల అధ్యక్షులు చంద్రగౌడ్, గణేష్, బంగారయ్య, హుస్సేన్, రాజు, మల్లయ్య, లక్ష్మయ్య, రేణుక పాల్గొన్నారు.

## సాఫీగా జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ

**లింగాల, జులై 15 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన 13వ విడత ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక సాఫీగా కొనసాగింది. గత 2021 మార్చి నుండి 2023 వరకు జరిగిన ఉపాధి పనుల్లో మండలంలో రూ 6.50 కోట్లు పనులు



చేపట్టారు. అందులో భాగంగా రూ. 35.508 వేలు మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు నుంచి రికవరీ చేయించినట్లు డిఆర్‌డిఎ ఎపిడి రాజేశ్వరి తెలిపారు. ఈసందర్భంగా డిఆర్‌డిఎ ఎపిడి రాజేశ్వరి మాట్లాడుతూ ఉపాధి పనులు గతంలో చేయించిన విధంగా కాకుండా ప్రతి సంవత్సరం బినామీ మాస్టర్లు తగ్గడంతో అక్రమాలకు తావు లేకుండా పోయిందని తెలిపారు. శనివారం చేపట్టిన సామాజిక తనిఖీ ప్రజావేదికకు ప్రజలు ఎవరు హాజరు కాకపోవడం గమనార్హం. ప్రజావేదిక నిర్వహించే సమయంలో మైక్ సౌండ్ ద్వారా ప్రజలకు వినిపించే విధంగా చర్చ జరగలేదని పలువురు చర్చించుకుంటున్నారు. అదేవిధంగా ఆధార్ ఫోన్ నంబర్ లింక్ అప్డేట్ చేసిపై స్థాయి అధికారులకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో అంబుర్స్‌మెంట్ జంగయ్య, జిల్లా విజిలెన్స్ అధికారి నజీర్, ఎస్ఆర్పీ కొండల్, ఎపిడి శ్రీనివాస్, ఎంపిడిఓ గీతాంజలి, ఎపిఓ హిమామ్, ఈసి శ్రీనివాసులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు టిఎలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.